క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కామేపల్లి: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా ముచ్చర్ల గ్రామంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీవీ ఫీల్డ్ అధికారి ప్రకాశ్, జోగారెడ్డి, కార్యదర్శి రవికుమార్, బ్యాంకు సిబ్బంది యండ్ర రామనాగయ్య పాల్గొన్నారు.

నెమలిపురిలో సర్వే చేసిన ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ బృందం

కామేపల్లి: మండలంలోని నెమలిపురి గ్రామంలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే బృందం సభ్యులు లక్ష్మణ్, గణేశ్, శ్రీనివాస్ బుధవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న టీకాలు, వైద్య సేవలను ఇంటింటికీ తిరిగి క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. 19, 20న మద్దులపల్లి, 21, 22వ తేదీన పొన్నెకల్ గ్రామంలో ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ బృందం సభ్యులు సర్వే చేయనున్నట్లు కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన తెలిపారు.

1104 యూనియన్ డైరీల అందజేత



ఎస్ఈకు డైరీ అందిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) నూతన సంవత్సర(2024) డైరీని బుధవారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ కార్యాలయంలో యూనియన్ ప్రతినిధులు ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్, డీఈటీ బాబూరావు, ఎస్ఏఓ ఏ శ్రీధర్, పీఓ అబ్దుల్ జిలానీ పాషాలకు డైరీలను అందించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, కార్య నిర్వాహణ. అధ్యక్షుడు జీఎల్ఎన్ రావు, జీవీఎస్ఎస్ శ్రీనివాస్, పి.సురేశ్, కె.శ్రీనివాసరావు, వీకే చారి, ఉమేశ్, శేషు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోదాంను సద్వినియోగం చేసుకోండి

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని జింకలతండా రోడ్డులో ఉన్న తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఇంటూరి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సోదరులు తాము పండించిన ధాన్యం లేదా అపరాలు, పత్తి మొదలైన వ్యవసాయ ఉత్పత్తులను ఈ గోదాంలో నిల్వ చేసుకోవచ్చని, స్టోరేజ్ చార్జీలు కూడా చాలా తక్కువగా ఉన్నాయి కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	సైంధవ్
సాయిరాం	నా సామిరంగ, గుంటూరు కారం
ఆదిత్య	గుంటూరు కారం
శ్రీనివాస	గుంటూరు కారం
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	70	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	50	తోటకూర	2
దొండ	26		10
పొట్లకాయ	46	గోంగూర	23
చిక్కుడు	110		10
గోరుచిక్కుడు	60	మెంతికూర	3
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		30
చామగడ్డ	56	పుదీన	1
క్యారెట్	50		20
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

'పది' పరీక్షలకు సన్నద్ధం..!

- పూర్తయిన పదో తరగతి సిలబస్
- రివిజన్‌పై దృష్టి సారించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు
- నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ కృషి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు సందేహాలను నివృతి చేస్తున్న ఉపాధ్యాయుడు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులపై మరింత దృష్టి సారించింది. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు ఈ ఏడాది ఫలితాల పెంపుపై దృష్టి సారించారు. గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించాలనే ఆకాంక్షతో విద్యాశాఖ ఉన్నట్లు స్పష్టంగా కన్పిస్తోంది. విద్యాశాఖ సూచనల మేరకు దాదాపు సిలబస్ పూర్తి కావడంతో రివిజన్‌పై ఉపాధ్యాయులు దృష్టి సారించారు. ఖమ్మం నగరంలో 20 ఉన్నత పాఠశాలలుండగా వాటిలో 985 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

సిద్ధం ఇలా..

సుమారు నెలన్నర రోజులుగా పదో తరగతి విద్యార్థులకు రివిజన్‌తో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మార్చిలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యాన పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో పాఠశాలల్లోని హెచ్ఎంల ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల్లో పాల్గొనడంతో పాటు విద్యార్థులకు సబ్జెక్ట్‌లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

పరీక్షలకు దోహదం..

పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలు విద్యార్థులకు నూతనోత్సాహాన్ని తీసుకొస్తున్నాయి. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సందేహాలు నివృత్తి అవుతుండగా మంచి గ్రేడ్‌లు వచ్చేందుకు దోహదం కానున్నాయి.

ఎంతో ఉపయోగం..



పదో తరగతికి సంబంధించిన సిలబస్ పూర్తవుతున్న క్రమంలో రివిజన్ జరుగుతుంది. పరీక్షలు ఎప్పుడు నిర్వహించినా మేం రాసేలా సిద్ధమవుతున్నాం. మార్చిలో వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యాన ప్రతీ సబ్జెక్ట్‌ను శ్రద్ధగా చదువుతూ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం.

– సంజన, విద్యార్థిని, ప్రభుత్వ బాలికల పాఠశాల

శ్రద్ధ పెరుగుతుంది..



పరీక్షలు దగ్గర పడుతున్న క్రమంలో చదువుపై మరింత శ్రద్ధ పెరుగుతుంది. ప్రతీ అంశంలో ఉన్న సందేహాలను ప్రత్యేక తరగతుల ద్వారా ఉపాధ్యాయులను అడిగి నివృతి చేసుకుంటున్నాం. దీంతో మాకున్న సందేహాలు తీరి పరీక్షలు మంచిగా రాస్తామనే విశ్వాసం ఏర్పడుతుంది.

– ఉషా, విద్యార్థిని, నయాబజార్ హైస్కూల్

ఫలితాల పెంపు దిశగా..



పది ఫలితాల పెంపు కోసం కృషి చేస్తున్నాం. ఇప్పటికే దాదాపు సిలబస్‌ను పూర్తి చేశాం. ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు రివిజన్ చేస్తుండడంతో విద్యార్థుల సందేహాలు నివృత్తి అవుతున్నాయి. గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది.

– కృష్ణకుమారి, హెచ్ఎం, శాంతినగర్ హైస్కూల్

సమస్యలపై డీటీఓకు వినతి



డీటీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు




నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత సెక్షన్106(1)(2)లను రద్దు చేయాలని, ఇది డ్రైవర్లకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారి ఎండీ గౌస్ పాషాకు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వలన ఏదైన ప్రమాదం జరిగితే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉన్నందున దీన్ని రద్దు చేయాలన్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటుతో పాటు ఆటో ఫైనాన్స్ కిస్తీలకు 3 నెలల సమయం కల్పించాలని, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం కోసం ప్రభుత్వ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆటోలు నిలుపుదలకు ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఆటో అడ్డాలు పెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్, నాయకులు రాందాస్, సాగర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్'పై డ్రైవర్లు, క్లీనర్ల ప్రదర్శన..

ఖమ్మంవ్యవసాయం: హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా డ్రైవర్లు, క్లీనర్ల సంఘం ఆధ్వర్యాన బుధవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాల్వొడ్డులోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన ప్రారంభమై కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, కార్యదర్శి బి.రామకృష్ణ, కోశాధికారి కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గోదాదేవి కల్యాణం



భక్తులకు స్వామివారి కల్యాణ ఘట్టాన్ని వివరిస్తున్న రామానుజ జీయర్ స్వామి

ఖమ్మంగాంధీచౌక్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వికాస తరంగిణి ఆధ్వర్యాన మంగళవారం రాత్రి నగరంలోని కమాన్‌బజార్ పుల్లఖండం ప్రాంగణంలో శ్రీ గోదారంగనాధుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం త్రిదండి దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యాన జరుగగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, సభ్యులు పావని, శశికళ, లక్ష్మి, మణి, శాంతి, పద్మావతి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

యువ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 25న దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యాన నిర్వహించే యువ ఓటర్ల యువ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి చేవెళ్ల మహేందర్‌రెడ్డి కోరారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈసమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్ గౌడ్, ఈదుల వీరభద్రం, బీజేపీ ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, జగదీశ్, రామకృష్ణ, పృథ్వీనాయక్, గోపి, సురేశ్, వెంకట్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మోటాపురం సర్పంచ్, కార్యదర్శిపై విచారణ



సర్పంచ్ ఆక్రమించిన స్థలాన్ని అధికారికి చూపిస్తున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: మోటాపురంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ రాంబాయి, కార్యదర్శి ఎం.నరసింహారావుపై వచ్చిన ఆరోపణలపై బుధవారం మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ విచారణ చేపట్టారు. పంచాయతీలో అధికార దుర్వినియోగం, నిధుల వినియోగంపై వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ మేరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టి పలు రికార్డులను పరిశీలించారు. కాగా, సర్పంచ్ విచారణకు హాజరు కాకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో చేసిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిన విషయం, రహదారుల వెంట మరం పోయకపోవడం తదితర విషయాలను గ్రామస్తులు విచారణాధికారి దృష్టికి తీసుకురాగా వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. సర్పంచ్ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న స్థలాన్ని పరిశీలించారు. వెంటనే సర్పంచ్, కార్యదర్శులను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈనేపథ్యాన శివ మాట్లాడుతూ.. సేకరించిన నివేదికను ఎంపీడీఓ, డీపీఓకు అందించడంతో పాటు విచారణకు హాజరు కానీ సర్పంచ్, కార్యదర్శులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావెళ్ల కృష్ణారావు, బొల్లినేని వెంకటేశ్వర్లు, బి.వాసు, చావా వినోద్, ఏలూరి మురళీ, కె.నాగేశ్వరరావు, రవి, చావా అజయ్‌కుమార్, కిరణ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

'బొమ్మ' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్

ఖమ్మంఅర్బన్: పాలిటెక్నిక్ ఫలితాల్లో నగరంలోని బొమ్మ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరినట్లు కాలేజీ చైర్మన్ రాజేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదారు శ్రీధర్, డైరెక్టర్ ఉదారు మాధవి, కళాశాల ప్రిన్సిపాల్, బీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: జాతి వివక్ష, అవమానాలతో హత్యకు గురైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో పీహెచ్ స్కాలర్ రోహిత్ వేముల వర్ధంతి సభను నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్‌లు హాజరై వేముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా రంగంలో దళితులపై విస్తృతంగా జరుగుతున్న వివక్ష, దౌర్జన్యాలను గ్రహించి వాటికి వ్యతిరేకంగా పోరాడిన వేముల నేడు ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలిచాడన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీకాంత్, వాసు, లాల్ పాషా, చరణ్, విష్ణు, వెంకటేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'కందాళ' పర్యటన



పైనంపల్లిలో మాట్లాడుతున్న కందాళ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి బుధవారం రాత్రి పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. తొలుత పైనంపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనును, చెరువుమాధారంలో ఇటీవల మృతి చెందిన జిల్లా మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం మాజీ అధ్యక్షుడు యడవల్లి చంద్రయ్య కుటుంబాన్ని, గువ్వలగూడెంలో పలు కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా ముజ్జుగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, మాజీ సీడీసీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, సర్పంచ్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



తిరుమలాయపాలెం: బచ్చోడులో రామసహాయం సునీతాదేవికి మంత్రి నివాళి



కూసుమంచి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/కూసుమంచి/ఖమ్మంటౌన్/కామేపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం నగరంతో పాటు నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాలు అందజేశారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన నిమ్మగడ్డ నగేష్, ముత్యాలరావు పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం రాజేశ్వరపురంలో మంత్రికి సర్పంచ్ దండా పుల్లయ్య పలు సమస్యలను వివరించగా.. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అలాగే తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో సునీతాదేవి దశదిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం పాతర్లపాడు, జింకలగూడెం గ్రామాలలో జోగిరెడ్డి, గోరేమియా కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా కూసుమంచి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుండా రవీందర్‌రెడ్డి, కొండా రూతమ్మ, ఆడెపు లక్ష్మమ్మలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు నెల్లూరి వీరభద్రం మంత్రి సమక్షాన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాక కాంగ్రెస్ ఖమ్మం జిల్లా నాయకుడు శెట్టి రంగారావు రెండో అన్న సుధాకర్‌రావు ఇటీవల మృతి చెందగా.. మంత్రి పొంగులేటి ఖమ్మం రాపర్తినగర్‌లోని శెట్టి నివాసానికి బుధవారం సాయంత్రం వెళ్లి పరామర్శించారు. అలాగే ఖమ్మంలోని మంత్రి నివాసంలో తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు బానోత ఈరునాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పలు సమస్యలను మంత్రి దృష్టి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీలు వజ్జా రమ్య, మంగీలాల్, మాజీ ఎంపీలు రామసహాయం సురేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, నాయకులు శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, భద్రయ్య, సీతారాములు, గరిడేపల్లి రామారావు, వంగవీటి నాగేశ్వరరావు, స్వర్ణకుమారి, మద్ది శ్రీనివాసరెడ్డి, చావా శివరామకృష్ణ, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నరేష్‌రెడ్డి, నూకల నరేష్ రెడ్డి, సింగు నర్సింహారావు, ఎండీ హఫీజుద్దీన్, కొరివి వెంకటరత్నం, జొన్నలగడ్డ రవికుమార్, ఎడవెల్లి రాంరెడ్డి, పోటు కళావతి, సముద్రాల శ్రీనివాసరావు, టీఎస్ టీటీఎఫ్ నాయకులు శ్యాముల్, రాందాస్, కిషన్ రాథోడ్, పాపాలాల్, అజ్మీర వీరునాయక్, హరి, దేవ్‌సింగ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొని నివాళులర్పించారు.

జంపింగ్ దరఖాస్తులపై కార్యదర్శుల కుస్తీ..



దరఖాస్తులను పరిశీలిస్తున్న కార్యదర్శులు

రఘునాథపాలెం: ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వారం రోజులు పాటు సేకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 21,870 వరకు దరఖాస్తులు రాగా వాటన్నింటిని 30 ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాలుగు రోజులు పాటు ఆన్‌లైన్ చేశారు. కానీ వాటిలో కొన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తులు ఒక పంచాయతీ జాబితా నుంచి మరో పంచాయతీ జాబితాల్లో కలిశాయి. దరఖాస్తుదారులే మండలం, గ్రామం అనే దగ్గర రఘునాథపాలెం అని నింపడంతో ఇలా కలిసినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా రఘునాథపాలెం పంచాయతీలోని బూడిదంపాడు, మంచుకొండ, వీవీపాలెం, కామంచికల్ తదితర పంచాయతీల దరఖాస్తులు కలిసినట్లు గుర్తించి మరోసారి పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు దరఖాస్తుదారులు జతపరిచిన జిరాక్స్‌లను ఆధారంగా చేసుకొని ఆయా పంచాయతీలకు మార్పులు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపాలెం: తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభా కళాశాల (స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్) ఖమ్మం రీజియన్ రఘనాథపాలెంలోని బాలుర కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.బాలస్వామి బుధవారం ప్రకటించారు. కాలేజీలో ప్రవేశం పొందిన వారికి ఇంటర్‌తో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, సదుపాయలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చిలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న ఎస్టీ బాలుర నుంచి ఆన్‌లైన్ ద్వారా WWW.tgtwgurukulam. telangana. gov.in ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో http://ttwreiscoe. egg. gov.in వెబ్‌సైట్‌లో రూ.200 చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు.

ఆర్జేసీ కృష్ణను కలిసిన బీఆర్ఎస్‌కేవీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండాల (ఆర్జేసీ) కృష్ణను ఆపార్టీ అనుబంధ విద్యుత్ కార్మిక సంఘం బీఆర్ఎస్‌కేవీ ఖమ్మం జిల్లా నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కార్మికులకు నిరంతరం అండగా ఉండేది తమ సంఘం మాత్రమే అని అన్నారు.సంఘం ప్రతినిధులు భవిష్యత్తులో బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ ఉపేందర్, యు.శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు ఎస్‌కె.షరీఫ్, ఖమ్మంటౌన్ డివిజన్ అధ్యక్షుడు గుడిసె రమేశ్, రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



ఉద్యోగులను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులను టీఎన్జీవోస్ నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ నాయకులు కొణిదన శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, గుంటుపల్లి శ్రీనివాస్, వల్లపు వెంకన్న తదితరులు మాట్లాడుతూ.. టీఎన్జీవోస్, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలను కలుపుకొని పటిష్టమైన ప్రణాళికతో ఐక్య కార్యాచరణ రూపొందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగం లక్ష్మణ్‌రావు, భరత్‌రెడ్డి, కృష్ణ, కోనార్, వెంకట్రావు, వీరభద్రం, హన్మంతరావు, రవిచంద్ర, రామారావు, నవీన్, వెంకటేశ్వర్లు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరంపై ప్రధాని రాజకీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడం కోసమే రామ మందిరంలో బాలరాముడు ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ వినియోగించుకుంటున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. బుధవారం స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామ మందిరంలో బలరాముడి విగ్రహ ప్రతిష్ఠకు కేంద్ర ప్రభుత్వం మితిమీరి జోక్యం, ప్రజల విశ్వాసాలను, మతపరమైన భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ మతం అయినా వ్యక్తిగతమని, దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఓ సాధనంగా వాడుకోవాలనే దుర్బుద్ధితో పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశంలో అనేక మత విద్వేష రాజకీయాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. దేశ అభివృద్ధి ఉద్యోగ కల్పన సంక్షేమం మరచిఆహార అలవాట్ల, మతం, మందిరం చుట్టూ దేశ ప్రజలను తిప్పడం ఏంటని ప్రశ్నించారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న కార్యక్రమంలా కాకుండా అది బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలా మార్చారని మండిపడ్డారు. పూర్తికాని మందిరాన్ని హడావుడిగా రానున్న ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజల మనోభావాలను అవమానపరచడమే అని ఆయన ఖండించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. గడచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదేశాలతో పోలీసులు అనేక మంది అమాయకులపై అక్రమంగా కేసులు మోపి రౌడీ షీటర్లను తెరిచారని వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కోరారు. డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్.శిరోమణి, కొల్లేటి నాగేశ్వరరావు, మంగతాయి, కె.శ్రీను, శోభ, రాకేశ్, తేజ, కేలోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.